నిధులు తెచ్చి మేడ్చల్‌ను అభివృద్ధి చేస్తాం

- మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి తీరుతాం
- మల్లారెడ్డిని, ఆయన అక్రమాలను వదిలేది లేదు
- కాంగ్రెస్‌లో చేరేందుకు మల్లారెడ్డి తిరుగుతున్నాడు
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



మేడ్చల్‌లో మాట్లాడుతున్న తోటకూర వజ్రేష్‌యాదవ్

మేడ్చల్: అధికారంలోకి వచ్చిన నాలుగు రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో రెండింటిని అమలు చేసి చూపించిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ వజ్రేష్ యాదవ్ అన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని మేడ్చల్ బస్టాండ్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి ఒక్కరోజులో ఏడు వేల మంది ప్రజలతో మాట్లాడి సమస్యలను విన్నారని అన్నారు. తాను ఓడినా మేడ్చల్ ప్రజలకు మాట ఇచ్చిన విధంగా మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి తీరుతానని, అన్ని సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. రూ.250 కోట్లు ఖర్చుచేసి మల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని, ఆయనను, ఆయన అక్రమాలను వదిలిపెట్టేది లేదని అన్నారు. మల్లారెడ్డి అక్రమాలపై తమ పోరాటం ఆగదని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరడానికి తమ నాయకుల చుట్టూ మల్లారెడ్డి తిరుగుతున్నారని అన్నారు. తాను నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ మేడ్చల్‌కు ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు.

నేడు బండారి లక్ష్మారెడ్డికి సన్మాన సభ

మల్లాపూర్: ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి సన్మాన కార్యక్రమాన్ని నాచారం ఏఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్ తెలిపారు. ఈ సన్మాన సభకు నాచారం డివిజన్‌లోని అన్ని కుల సంఘాలు బస్సు సంఘాలు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు అపార్టుమెంట్ వాసులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రతిభ వెలికితీసేందుకే ఆటల పోటీలు

బోడుప్పల్: ఆటల పోటీల్లో విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని బచ్‌పన్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రీజనల్ డైరెక్టర్ రూపారెడ్డి అన్నారు. బోడుప్పల్ బచ్‌పన్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు బ్రాంచీలకు చెందిన విద్యార్థులకు స్పోర్ట్స్, అకాడమిక్స్, ఫైన్ఆర్ట్స్ విభాగాల్లోని పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో ప్రజ్ఞాపాటవాలను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బాల్యంలోనే ఇలాంటి పోటీల్లో సరైన శిక్షణ ఇస్తే ఉన్నతంగా రాణిస్తారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ చాలా ముఖ్యం

కాప్రా: విద్యార్థులు పట్టుదలతో చదవడం ఎంత ముఖ్యమో క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమని భాష్యం స్కూల్ చైర్మన్ రామకృష్ణ అన్నారు. శనివారం ఏఎస్‌రావునగర్‌లోని భాష్యం హైస్కూల్ బ్రాంచ్‌లో పరీక్షలపై టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను అర్థం చేసుకుని వారి కలలను నెరవేర్చే విధంగా కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ సలహాదారులు మైఖేల్ మార్కండేయులు, ఈసీవో చైతన్య, ప్రిన్సిపాల్ అమరేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం అభినయ కూచిపూడి కళాక్షేత్రం గురువర్యులు పావని శ్రీలత శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఎంతగానో అలరించింది.

కార్తీక శోభ





కీసర: మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి(ఎంబీబీఎస్) ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని శనివారం మండలంలోని భోగారం గ్రామంలోని నిమ్మకాయల గూడెం వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు దోర్బల కృష్ణమూర్తిశర్మ, ప్రధానకార్యదర్శి గణపురం రాంప్రసాద్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ప్రత్యేక పూజలతో పాటు కుటుంబసమేతంగా వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 100 కుటుంబాలు కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు.

చీర్యాలలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సత్యనారాయణ వ్రతాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. శనివారం ఉదయం నుంచే స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున చీర్యాల ఆలయానికి తరలివచ్చారు. సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొని, సప్త వృక్షాల వద్ద కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.



మహాలక్ష్మి.. హ్యాపీ..



మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై సంతోషం

- ఉద్యోగాలు చేసుకునేవారికి ఎంతో మేలు
- ప్రతినెలా కొంత పొదుపు చేసుకునే అవకాశం
- ఈ పథకంతో ప్రయోజనం అంటున్న మహిళలు

మేడ్చల్ జోన్ బృందం: ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా శనివారం ప్రారంభించిన మహిళలకు ఉచిత ప్రయాణం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. మేడ్చల్ నగరశివార్లలో ఉండటంతో అధికంగా సబ్‌అర్బన్ బస్సులు, ఆర్డినరీ, మెట్రో సర్వీసులు నడుస్తుండటం వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంపై ఆనందం వెలిబుచ్చారు. ప్రధానంగా పూలు, కూరగాయాల మార్కెట్లు, కాలేజీలు, ఉద్యోగాలకు వెళ్లే వారు తమకు ఈ పథకంతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రతినెలా కొంత డబ్బు ఆదా చేసుకోవచ్చని అన్నారు. బస్ పాసులకు చెల్లించే డబ్బులు మిగులుతాయని విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళలు అన్నారు. రోజువారి కూలి పనులకు వెళ్లే మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అన్నారు. మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ(చేయూత) పథకాన్ని పారంభించడం సంతోషంగా ఉందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.



ఆకు కూరలు, పూలు అమ్ముతా..

రోజూ రూ.100 చార్జీలు అయ్యేవి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించినందుకు టికెట్ డబ్బులు తీసుకోలేదు. రెక్కాడితే డొక్కాడని మాలాంటి పేదలు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వ నిర్ణయంతో నాకు ప్రతిరోజూ రూ.100, నెలరోజులకు రూ.3000 వేలు మిగులుతాయి. చాలా సంతోషంగా ఉంది.

– రాజవ్వ, ప్రయాణికురాలు



మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సంతోషంగా ఉంది



సోనియా గాంధీ పుట్టిన రోజున మహాలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టడం సంతోషంగా ఉంది. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం చేయడం సంతోషంగా ఉంది. జీవితంలో తాము ఉచితంగా ప్రయాణం చేస్తామని ఊహించలేదు. ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసినందుకు సంతోషంగా ఉంది.

– విజయ, కీసర

ప్రతినెలా డబ్బులు మిగులుతాయి



నేను ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాను. బాలాజీనగర్ నుంచి సికింద్రాబాద్‌కు ప్రతి నిత్యం వెళ్తున్నాను. బస్సులో ఉచితంగా ప్రయాణం చేస్తామని నా కలలో కూడా అనుకోలేదు. ప్రతినెలా బస్సు చార్జీలు మిగులుతాయి. మహిళలకు సమయానికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు.

– భావిక, బాలాజీనగర్,

ఇక అన్నీ తిరుగుతాం



తెలంగాణలోని అన్ని పుణ్య క్షేత్రాలను తిరుగుతాం. అన్ని ప్రాంతాలను పైసా ఖర్చు లేకుండా చూస్తాం. వేములవాడ, యాదగిరిగుట్ట, కొండగట్టు వంటి పుణ్య క్షేత్రాలను చూసివస్తాం. ఉచిత రవాణా సౌకర్యం కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– సరిత, మేడ్చల్

హామీ అమలు భేష్..



కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఉచిత ప్రయాణం హామీని ఇంత త్వరగా అమలు చేస్తారని అనుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా హామీలను అమలు చేయడం సంతోషంగా ఉంది. విద్యార్థినులు, ఉద్యోగులకు మరింత మేలు. పేద, మధ్యతరగతి వారికి కొంత డబ్బు ఆదా అవుతుంది.

– అంజలి, మేడ్చల్

అడ్రాస్‌పల్లి భూములు కబ్జా కానివ్వం

- గ్రామస్తుల ఆందోళనతో స్పందించిన కలెక్టర్
- విచారణకు ప్రత్యేక అధికారిగా కీసర ఆర్డీఓ
- సత్వరమే నివేదిక అందజేయాలని ఆదేశం



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి మండలం అడ్రాస్‌పల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని శనివారం కీసర రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీఓ) రాజేష్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. భూముల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదని, అందరికీ న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అడ్రాస్‌పల్లి భూములపై ప్రత్యేక అధికారిగా కీసర ఆర్డీవో రాజేష్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించిన కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సత్వరమే నివేదిక అందజేయాలని ఆదేశించారు. అడ్రాస్‌పల్లి గ్రామ పరిధిలోని 235 సర్వే నంబర్‌లోని 15 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ పంచాయతీ సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. అలాగే, అడ్రాస్‌పల్లి పంచాయతీ పాలకవర్గం కూడా ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తీర్మానం చేసి, సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో మూడేళ్లుగా కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి పత్రాలను సమర్పిస్తున్నా.. రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించిన విషయం తెలిసిందే.. అడ్రాస్‌పల్లి గ్రామస్తుల ఆందోళనలపై స్పందించిన జిల్లా కలెక్టర్ గౌతమ్ ఎట్టకేలకు విచారణ కోసం ప్రత్యేక అధికారిగా కీసర ఆర్డీఓ రాజేష్‌కుమార్‌ను నియమించడంతో పాటు సత్వరమే నివేదిక అందజేయాలని ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములకు సంబంధించి స్థానికులు ఆందోళన చెందవద్దని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. భూకబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



గౌతంనగర్: 10వ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని భాష్యం విద్యా సంస్థల నిర్వాహకులు రామకృష్ణ అన్నారు. శనివారం మల్కాజిగిరిలోని లక్ష్మిసాయి గార్డెన్స్‌లో 7 బ్రాంచ్‌లకు చెందిన 10వ తరగతి భాష్యం సంస్థల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భాష్యం విద్యా సంస్థలు వ్యవస్థపకులు రామకృష్ణ తనయుడు సాకేత్, సీఈఓ చైతన్య, జోనల్ ఇన్‌చార్జి మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

పోచారం: మహిళ అదృశ్యమైన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్ గూడకు చెందిన రాధికకు రెండేళ్ల క్రితం సుధాకర్‌తో వివాహం జరిగింది. 4వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆచూకీ లేకపోవడంతో శనివారం ఆమె తండ్రి పిట్టల యాకయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్థాపంతో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్థాపంతో ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బండారి శ్రీను(32)కు 16 ఏళ్ల క్రితం వివాహమైంది. 15 రోజుల క్రితం అతడి భార్య చెప్పకుండా తల్లిగారింటికి వెళ్లిపోయి తిరిగి రావడం లేదు. దీంతో మనస్థాపంతో మద్యానికి బానిసయ్యాడు. ఐదు రోజులుగా ఇంటికి వెళ్లడం లేదు. ఘట్‌కేసర్ రైల్వే క్వార్టర్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడిఉందని స్థానికులు శుక్రవారం మధ్యాహ్నం సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా అనంతరం ఘట్‌కేసర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ గ్రీన్ గోల్డ్ అపార్ట్‌మెంట్‌లో రాజు గురుస్వామి లక్ష్మీల ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తి పాటలు, భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సామూహిక అన్నదానం జరిగింది. వెంకటేష్‌యాదవ్, బికే. శ్రీనివాస్, సంతోష్ రాందాస్, సిరిగిరి రాజు, రాంచందర్, మోహన్‌రాజ్, ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఉచిత ప్రయాణం ప్రారంభం



మేడ్చల్ బస్టాండ్లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో కలిపించిన ఉచిత ప్రయాణం సేవలను మేడ్చల్ లో ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మేడ్చల్ డిపోలో బస్సులను అందంగా అలంకరించి సోనియా గాంధీ బర్త్ డే సందర్భంగా కేకులు కట్ చేసి బస్సులను ప్రారంభించారు. నియోజకవర్గ నాయకులు వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్, కౌన్సిలర్లు సరితా మల్లేష్‌గౌడ్, చాపరాజు, భవాని రాఘవేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారయణ తదితర నాయకులు, డీఎం సుధాకర్ తదితరులు విడివిడిగా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మేడ్చల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సన్‌ఫ్లవర్ వేదిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సన్ ఫ్లవర్ వేదిక్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్–14 బాస్కెట్‌బాల్ టోర్నీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృడత్వం కలుగుతుందని విద్యార్థులు క్రీడారంగంలో రాణించి గుర్తింపు పొందాలన్నారు. టోర్నీలో ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు పాల్గొని పోటీలో ప్రత్యర్థి జట్లతో తలపడ్డాయి. రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహణకు సహకారం అందించిన పాఠశాలను అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కేశవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వినోద్, మాజీ కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, కన్వీనర్లు రమణ, ఫారూక్, రాహుల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



గుండ్లపోచంపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



అన్నోజిగూడలో..

మేడ్చల్ జోన్ బృందం: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టిన రోజును అన్ని ప్రాంతాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. పలుచోట్ల సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలు ప్రాంతాల్లో పేదలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.



మేడ్చల్‌లో రక్తదానం చేస్తున్న నాయకులు



కీసరలో..



ఘట్‌కేసర్‌లో..

ప్రజా సంక్షేమ పాలన మొదలైంది

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు హామీల్లో మహాలక్ష్మీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రవేశపెట్టిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారని, ప్రజా సంక్షేమ పాలన మొదలైందని ఆయన అన్నారు. ఉప్పల్ డిపో వద్ద శనివారం కేక్ కట్ చేసి సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు అవుతాయని, ఇది ప్రజా ప్రభుత్వమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి, నాయకులు కొత్త కిషోర్‌గౌడ్, రాపోలు రాములు, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, దానగల్ల యాదగిరి, బూక్యా మణిరాం నాయక్, శ్రీలత బద్రు నాయక్, కొత్త దుర్గమ్మ, పొద్దుటూరి శోభారాణి, సుధాకర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, జంగారెడ్డి జంట కార్పొరేషన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.